నమస్తే తెలంగాణ
వరంగల్ హనుమకొండ
5 | సోమవారం 15 జనవరి 2024 | WARANGAL HANUMAKONDA

సరదాల సంక్రాంతిని సంబురంగా జరుపుకొనేందుకు అందరూ సిద్ధమయ్యారు. రంగవల్లులతో వాకిళ్లన్నీ పులకరించనుండగా, పసుపు కుంకుమ పులుముకున్న గొబ్బెమ్మలు ముచ్చట గొలుపనున్నాయి. సకల సౌభాగ్యాలు కలగాలని నోచే నోములు, తీరొక్క బొమ్మల కొలువులతో సోమవారం ఇంటింటా సందడి నెలకొననుండగా, గంగిరెద్దుల విన్యాసాలు, ఆకాశాన పతంగుల విహారాలు ఆకట్టుకోనున్నాయి.
- నమస్తే నెట్‌వర్క్, జనవరి 14

సరదాల సంక్రాంతి

నేడే పండుగ

ముంగిట ముత్యాల ముగ్గులు.. ముచ్చటగొలిపే గొబ్బెమ్మలు

ఆకట్టుకునే గంగిరెద్దుల విన్యాసాలు

ధనుర్మాసం ముగిసి, సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించే రోజును మకర సంక్రాంతిగా పిలుస్తారు. భానుడు దక్షిణాయనం చాలించి, ఉత్తరాయణంలోకి అడుగుపెట్టే సంక్రాంతి పర్వదినాన్ని సోమవారం ఘనంగా జరుపుకోనున్నారు. ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభంలో దేవతలు దివి నుంచి భువికి వస్తారని ఆ సమయంలో అలంకరణ ఉన్న ఇంట్లోకి దేవతలు ప్రవేశిస్తారని నమ్ముతారు. శివుడి వాహనం నంది స్వరూపాలుగా భావించే గంగిరెద్దులు ఇంటి ఆవరణలో ప్రవేశించడాన్ని శుభసూచకంగా భావిస్తారు. హరిదాసును విష్ణుస్వరూపంగా భావించి ధాన్యాన్ని దానంగా సమర్పిస్తారు. హరిదాసు సంకీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలు చిన్నాపెద్దలను ఆకట్టుకుంటాయి. అలాగే సంక్రాంతికి ఇంటింటా చిన్నారులు బొమ్మల కొలువులు ఏర్పాటు చేస్తారు. మహిళలు నోములు నోచుకుని ముత్తయిదువులను పిలిచి వాటిని కానుకగా అందజేసి ఆశీర్వాదం తీసుకుంటారు. బెల్లం, నువ్వులు ప్రసాదాలుగా పంచిపెడుతారు. అలాగే సంక్రాంతి పండుగకు పతంగులు ఎగురవేయడం ఆనవాయితీగా వస్తోంది. చిన్నాపెద్దా గాలిపటాలు ఎగురవేస్తూ సరదా తీర్చుకుంటారు. పలు చోట్ల పతంగుల పోటీలు కూడా నిర్వహిస్తారు. పండుగ రోజున భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలను సందర్శించి పూజలు చేస్తారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతాయి. ఐనవోలు మల్లన్న, కొత్తకొండ వీరన్న జాతరలు జోరుగా సాగుతాయి. రైతులు పశువులను శుభ్రంగా కడిగి, ఎడ్లబండ్లను అలంకరించి, ఇంటిల్లిపాది కలిసి జాతరకు, ఆలయాలకు వెళ్తారు.

రాయపర్తి మండలం వెంకటేశ్వరపల్లెలో ఆలయం వద్ద సంధ్యాసమయాన పతంగులు ఎగురవేస్తున్న చిన్నారులు
– వరంగల్ ఫొటోగ్రాఫర్

పశువులను పూజించే పండుగ..

సంక్రాంతి తర్వాతి రోజును కనుము పండుగగా జరుపుకొంటారు. దీనినే పశువులను పూజించే పండుగ అంటారు. 'కనుము' అంటే పశువు అని అర్థం. మన గాదెలన్నింటినీ ధాన్యంతో నింపడంలో తోడ్పడేవి పశువులే. దుక్కి దున్నిన నాటి నుంచి పంట ధాన్యాన్ని గాదెలకు చేర్చే వరకు శ్రమించిన పశువులను ఆరాధించడమే కనుమ పండుగలోని పరమార్థం. ఈ రోజున పశువులను కడిగి పసుపు, కుంకుమను కొమ్ములకు అలంకరించి ముఖానికి బొట్టు పెట్టి ఊరేగిస్తారు. అలాగే, కనుమ రోజు పితృదేవతలకు పూజలు చేస్తారు.

వీరబోనంతో ఆలయానికి వస్తున్న కుమ్మరులు

భక్తజనకొండ

వీరభద్రుడికి కుమ్మరి బోనం

కొత్తకొండ జాతరకు పోటెత్తిన భక్తులు

ఆకట్టుకున్న శివసత్తుల నృత్యాలు, వీరశైవుల ప్రదర్శనలు

కొత్తకొండలో బోనంతో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న కుమ్మరి వంశస్తులు

భీమదేవరపల్లి, జనవరి 14: కొత్తకొండ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కడిపికొండ, దామెరకు చెందిన కుమ్మరి వంశస్తులు ఆనవాయితీ ప్రకారం భోగి పండుగ రోజు కుమ్మరి (వీర)బోనం చేశారు. ఈ సందర్భంగా ఎడ్లబండ్లను రథాలుగా తీర్చిదిద్దారు. శివసత్తుల నృత్యాలు, వీరశైవుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. బోనంతో వెళ్లిన కుమ్మరి వంశస్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. తమ గండాలు తొలగిపోవాలని గండ దీపం వద్ద నూనె పోశారు. కోరిన కోర్కెలు తీర్చాలని స్వామి వారికి కోరమీసాలు సమర్పించారు. కోడె మొక్కులు చెల్లించుకున్నారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్, బీజేపీ నాయకులు బొమ్మ శ్రీరాంచక్రవర్తి, రావు పద్మ, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

నేడు ఎడ్లబండ్ల రథాల ఆలయ ప్రదక్షిణ

మకర సంక్రాంతి పర్వదినాన సూర్యుడు ధనస్సురాశి నుంచి మకర రాశిలోకి ప్రవేశిస్తాడు. ఈ రోజున స్వామివారిని దర్శించుకుంటే అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. సోమవారం ఎడ్లబండ్ల రథాలు ఆలయ ప్రదక్షిణలు చేస్తాయి.

ఐలోని మల్లన్నకు కోటి దండాలు

జాతరలో భక్త జనసంద్రం

బోనాలు, పట్నాలతో సందడి

శివసత్తుల పూనకాలు, పోతరాజు విన్యాసాలతో మార్మోగిన ఆలయం

కొలువుదీరిన ఐనవోలు మల్లికార్జునస్వామి

ఐనవోలు, జనవరి 14: మమ్మేలు మల్లన్నకు కోటి దండాలు అంటూ భక్తజనం స్వామి వారిని దర్శించుకుని తరించింది. భోగి సందర్భంగా శనివారం ఐనవోలు మల్లికార్జున స్వామిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు రాత్రే ఆలయానికి చేరుకొని విడిది చేశారు. తెల్లవారుజాము నుంచే స్వామివారి దర్శనం కోసం క్యూ కట్టారు. విడిది చేసిన చోటే భక్తులు బోనం చేయగా, ఒగ్గు పూజారులు పట్నాలు వేశారు. భక్తులు స్వామివారికి నైవేద్యాలతో మొక్కులు చెల్లించుకున్నారు. శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలతో ఆలయం మార్మోగింది. గుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి పడమర వైపు ఉన్న ఎల్లమ్మ దేవాలయంలో బోనాలు సమర్పించారు. శాసన మండలి చైర్మన్ బండా ప్రకాశ్, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్, హనుమకొండ జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, రైతు రుణ విమోచన మాజీ చైర్మన్ నాగుర్ల వెంకన్న, ఎంపీపీ మార్నేని మధుమతి, జడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల్లి శ్రీరాములు, కార్పొరేటర్ల ఇండ్ల నాగేశ్వర్ రావు తదితరులు స్వామి వారిని దర్శించుకున్నారు.

బోనాలకు నమస్కరిస్తున్న భక్తురాలు

నేడు పెద్ద బండ్లు తిరుగుట..

నేడు సంక్రాంతి పండుగ రోజున స్వామి వారికి ఉత్తరాయణ, పుణ్యకాలము, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనము, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, బిల్వార్చన, మహానివేదన, నీరాజన మంత్ర పుష్పం చేయనున్నారు. రాత్రి మార్నేని వంశీయుల పెద్దబండి, ఐనవోలు, ఒంటి మామిడిపల్లి, ముల్కలగూడెం, పెరుమాండ్లగూడెం గ్రామాల ప్రభల బండ్లు తిరుగుతాయి.

వరం పడుతున్న మహిళలు